
తెల్లవారితే భోగి పండుగ.. భోగి తెల్లవారి సంక్రాంతి.. సంక్రాంతికి చంకలు లేపలేనంత చలుంటే శివరాత్రికి శివశివంటూ వెళ్ళిపోతుందన్నది సామెత.. ఈ సంక్రాంతికి కూడా చలి విపరీతంగానే ఉంది. అంత చలిని జయించడానికి పడుచు జంటలు మరింత దగ్గరవుతున్నాయి. జనమంతా లిపాపల్లా మలుచుకొని పడుకున్నారు. అంత చలిలోనూ అర్ధ రాత్రి దాటేవరకు చకినాల పిండిని దంచే రోకళ్ళమోత వినబడుతూనే ఉంది. కొందరు తెల్లవారుజామున పిండి దంచుతారు. వారంరోజులుగా ఊళ్ళో చకినాలు



# ప్రకృతి అందాలు- విధ్వంస దృశ్యాలు

- డా. కాలువ మల్లయ్య

చేసే కార్యక్రమం కొనసాగుతూనే ఉంది. సంపన్నులు వారం ముందే చకినాలు చేసుకుంటే పేదవాళ్ళు పండుగ ముందు, పండుగ రోజున చేసుకుంటున్నారు. ఊరంతా మత్తుగా నిద్రబోతుంది. లసుమయ్య ఇంట్లో గంపకింది కోళ్ళు అటూ ఇటూ మెసలుతున్నాయి. చింత చెట్టుమీది గూళ్ళలో పక్షులు నిదురబోతు న్నాయి.

తెల్లవారే చుక్కపొడిచి చాలాసేపే అయింది. మరి కొద్దిసేపట్లోనే 'కొక్కొరోకో' అంటూ కోడి కూసింది. ఇంకొద్దిసేపట్లో అందరి ఇండ్లలోంచి కూతలు వినబడు తున్నాయి. ఊళ్ళో అలికిడి మొదలవుతుంది. రోకళ్ళ చప్పుళ్లూ వినబడుతున్నాయి.. చింతచెట్టుమీది నుంచి కాకులు అరుస్తున్నాయి. ఊరు నిద్రలేస్తుంది.. పశుపక్షా దులు మేల్కొంటున్నాయి. కోడి కూతతోనే చాలామంది నిద్రలేస్తున్నారు. ముంతలు పట్టుకొని బహిర్భూమికి వెళ్తున్నారు. కొందరు వరిగడ్డి మంటలేసుకొని కాగుతు న్నారు. ఊరు మేల్కొంటుంది. ఏరూ మేల్కొంటుంది..

లసుమయ్య తాత నిద్రలేచాడు. పెంటబొందలో మూత్రం చేసి వచ్చి కాళ్ళు కడుక్కున్నాడు.

"తెల్లారుతుంది.. లేంద్రి లేంద్రి..." అన్నాడు...

ఎవరూ స్పందించలేదు..

"కొంరమ్మా! లేవే... కోడి కూత వినబడుతలేదా? కాకులు మొత్తుకుంటున్నది వినస్తలేదా?" అన్నాడు భార్యనుద్దేశించి...

"బొమ్మానంగ చలివెడుతుంది.. కొంచెమాగలేవు..." అంది కొంరమ్మ...

"సిగ్గులేదా అట్లనుటానికి... కోడికూసినంక గూడ పంటవా...? కొంరెల్లి... రాజన్నా... ఓదెన్నా... లేంద్రి..."

తండ్రి మాటతో ముగ్గురు కొడుకులు లేచి కూచు న్నారు...

వాకిట్లో వరిగడ్డి మంటవేసాడు లసుమయ్య.

ముగ్గురు కొడుకులు మంట చుట్టూ చేరారు...

"మనుమడా మనోహర్... లే బిడ్డ లే..." అన్నాడు లసుమయ్య. "చలికాచుకుందువు లే..." మరోసార న్నాడు.

బద్ధకంగా నిద్రలేచాడు మనోహర్. అతన్తోపాటు పిల్ల లంతా లేచారు... చలిమంట దగ్గర కూచున్నాడు మనో హర్... మంట పైకి చేతులు చాపాడు... కాళ్ళు మంట దగ్గరకు జరిపాడు.

కాకులు కావ్ కావ్‌మని అరుస్తూనే ఉన్నాయి...

మరికొద్దిసేపట్లోనే చెట్టుమీంచి పక్షులు లేచి ఆహార సంపాదనకై బయటకెళ్ళాయి.

కొంరమ్మ లేచి మంచాలెత్తింది. కోళ్ళను విడిచిపె ట్టింది. 'కుక్కు కుక్కు..."అంటూ అవి పెంటబొంద దిక్కువెళ్ళాయి. లసుమయ్య కోడల్లు ముంతలు పట్టు కొని వెళ్ళారు...

ఇంతలో బుడుబుక్కల వాడొచ్చాడు.

అంబ పలుకు జగదంబ పలుకువే అంటూ జగ్గు వాయిస్తున్నాడు...

"ఏం రాజయ్యా...! తెల్లవారుతుంది. ఇప్పుడా నువ్వు వచ్చేది- రెండుజాముల రాత్రుండగనే బయలుదేరుతా వుగద- మీరు గూడ సమయం దప్పుతున్నరా...?" అన్నాడు లసుమయ్య.

"లేదు పటేలా...! నేను అద్దువన్రాత్రే బయలెల్లిన... ఊరు అటు కొసనుండి బయలుదేరిన గద... తిరు క్కుంట ఇటచ్చేవరకు గీయాల్లాయె.. మేం తిరిగేదే రాత్రినుంచి బలబల తెల్లారేవరకు..." అన్నాడు రాజయ్య.

"పొద్దెక్కిందంటె ఇంట్లవడుతారుగద... మరి గీ రాత్రి తిరుగుడెందుకు...?"

"మీకు తెలువందేముంది పటేల...మేం రాత్రే తిరుగుతం..."

"దొంగ... దొర... పురుగుబుషి.. రాత్రత్తె ఎవ్వలే మనుకోరు గదా...!"

"ఏమనుకోరు పటేల... ఎంత నిద్రలున్నా లేచి భిక్షం బెడ్తరు..."

కొంరమ్మ భిక్షందెచ్చి బుడబుక్కల వాని జోలెలో వేసింది. తరతరాలను దీవిస్తూ బుడబు క్కలవాడు వెళ్ళిపోయాడు.

కోడండ్లు తిరిగి వచ్చారు.

వాళ్ళు ఊరిలో పనిచేస్తున్నారు. ఒకరు వాకిలూ డుస్తున్నారు. ఇంకొకరు ఇంట్లో ఊడుస్తున్నారు. మరొకరు పొయ్యిల బూడిదెత్తుతున్నారు. వాకిట్ల అలుకు చల్లుతున్నారు. ఇంట్లో పుట్టమన్నుతో ఇల్ల లుకుతున్నారు. వాకిట్లోంచి పెండవాసన, ఇంట్లోంచి పుట్టమన్ను వాసన వస్తోంది. మగవాళ్ళు చ కాగడం ఆపారు. మంటనార్పారు. "మనోహర్ నువ్వు చెరువుకు పోయి రాపో.. అన్నాడు లసుమయ్య. కాల కృత్యాలు తీర్చుకుంటానికి మనోహర్ చెరువుదిక్కె ళ్ళాడు.

"ఓదెన్నా... కొంరెల్లి...రాజన్నా...! ఇయ్యాల్ల పశువుల పండుగ గదా ఇయ్యాల్ల నాగలి గట్టకున్నా మంచిదే... గొబ్బెమ్మలు తయారుచేసుటానికి ఆవుపేడ కావాలె... మన ఆవును దూరం కట్టేసింద్రు గద... కాలువకెళ్ళి పనులు తీర్చుకొని ఆవుపెండ తీసుకరాంద్రి..." అన్నాడు లసుమయ్య.

"తెస్తం నాయిన్నా..." అన్నారు వాళ్ళు.

'పెండకళ్ళు తీసి కొట్టం శుభ్రం జేయింద్రి... ఎడ్లకు నీళ్ళువెట్టి మ్యాతేసి రాంద్రి..."

అట్లనే అని వెళ్ళిపోయారు వాళ్ళు...

మనోహర్ చెరువుదిక్కెళ్ళారు.

ఊరి పశువులను లింగయ్య జమ చేస్తున్నాడు.

బర్లహనుమయ్య బర్లను జమచేస్తున్నాడు. కత్తెర్ల వాళ్ళ ఎడ్లు, ఆవుల మందలు ఊరుబయటకెళ్తున్నాయి. పశువు గిట్టల చప్పుడు లయబద్ధంగా వినబడుతుంది.

ఊరంతా పనిపాటల్లో పడిపోయారు.

పండుగయినందున చాలామంది పొలం పనులకు వెళ్ళడం లేదు. ఛటక్ ఫటక్ అంటూ మగ్గం గుంటల నుండి నాడె చప్పుడు వినబడ్తుంది. భుజాలమీద గొంగళ్ళతో కట్టెకు డబ్బగిన్నెలతో గొర్లకాపర్లు ఇంటికి వస్తున్నారు. పాడి ఉన్నవాళ్ళ ఇండ్లనుండి కవ్వం చప్పుళ్ళ వినబడుతున్నాయి. గొల్ల భూమక్క పాటలు పాడుతుం

బజార్లో ఉరుకులయ్యోరు తలమీద చెంబును చేత్తో పట్టుకోకుండా అటూ ఇటూ ఉరుకుతున్నాడు. చిరుతలు వాయిస్తున్నాడు. చెంబులో ఏదైనా వేసినపుడు కూర్చుంటున్నాడు. తర్వాత లేచి పరుగెత్తుతున్నాడు. ఊరంతా పండుగ సంబరంలో హడావిడిగా ఉంది.

చెరువుకుపోయి కాలకృత్యాలు తీర్చుకున్నాడు మనోహర్.. తాత దగ్గరకొచ్చి నిల్చున్నాడు.

సత్తవ్వ ఇంట్లో ముగ్గులేస్తుంది. లసుమవ్వ వాకిలి నిండా ముగ్గులేస్తుంది.

"గరుకపోచలు, రేగుపండ్లు తీసుకరాపో... గొబ్బెమ్మలకు కుచ్చాలె..." అన్నాడు లసుమయ్య మనుమనితో...

ఆ పనిపై మనోహర్ వెళ్ళాడు...

ఆవుపేడ తెచ్చి వాకిట్లో వేసాడు ఓదెన్న..

"నవధాన్యాలు తయారుచేసినారె.." అడిగాడు లసుమయ్య..

"మాకు తెలువదా? అన్ని కలిపుంచినం..." అంది కొంరమ్మ.

"అన్ని ఉన్నట్టేనా...?"

"మా ఉన్నయి గని నువ్వు చప్పుడు జేకుండు... మేం చేసుకుంటం..."

"ఏంది.. అడుగుతె మీదికి పోవడ్తివి కొంరమ్మ?"

"మాకు తెలువదా? ఆడోల్ల పనులు నువ్వు జెప్తున్నా..? గా మాంసమయితె తెప్పియ్యి... మనూల్లె కొయ్యకుంటె గాజులపెల్లికి ఎవ్వలనన్న తోలి తెప్పియ్యి..."

"మాంసమెందుకు తియ్యి... కోన్ని కోసుకుందాం.. రాజన్న చాకలయినెను తీసుకురాను పోయిండు..."

ఇంతలో "కొంరమ్మా.. కొంత చల్లబొయ్యి..." అంది వాకిట్లో నిల్చొని రంగమ్మ.

చెంబులో పడికెడంత తవుడుంది.

ఆ తవుడును గిన్నెలో పోసింది కొంరమ్మ.. చెంబు కడిగింది.. "ఆఁ... మీకు పరుగుత్తగనే పొయ్యాలె.." అంది.

చల్ల చెంబులో పోస్తూ..

"పొయ్యకుంటె అమ్ముకుంటవా కొంరక్క... మనూల్లె పాలు, పెరుగు అమ్ముకునుడున్నదా...? కూరగాయలు గూడమ్మరు..."

"ఏదో అట్ల మాటవరసకంటి... చల్లమ్ముకునుడేంది..? అని లోపలికెళ్ళింది కొంరమ్మ.

గొబ్బెమ్మలు చేస్తున్నాడు మనోహర్.

"పిలగా నువ్వు గొబ్బెమ్మలు చేస్తున్నావా?" అంది చల్లకొచ్చిన వీరమ్మ.

"ఏందే ఈరవ్వ... మొగోల్లయితె చెయ్యద్దా... మా మనోహర్ బతుకమ్మ పండుగకు గుట్టకుపొయ్యి తంగెడు పువ్వు తెస్తడు. చెల్లెండ్లకోసం అన్ని పువ్వులు తెస్తడు.." అన్నాడు లసుమయ్య.

"తేవాలె తాత.. ఏదో మరిది వరుసాయెపటికె అన్నాను..."

ఇంట్లో వాకిట్లో ముగ్గేయడం అయిపోయింది.. మనోహర్ గొబ్బెమ్మలు చేసి గరికపోచలు గుచ్చాడు. ముగ్గుల్లో గొబ్బెమ్మలు పెట్టారు.. చుట్టూ నవ ధాన్యాలు పోసారు. చాకలి లింగయ్య వచ్చి కోన్ని కోసాడు.

ఆడవాళ్ళు వంటపనుల్లో ఉన్నారు.

ఓదెన్న, కొంరెల్లి వచ్చారు. రాజయ్య గొర్లమందకాడికి పోయాడు.. "ఎడ్లమీద జాజుతోని చేతి ముద్రలేసింద్రా...? పూలదండ లేసింద్రా...?" అడిగాడు లసుమయ్యా...

"ఎడ్లను తోలుకొని బతుకమ్మ వాగులకు పోయినం... వాటిని కడిగినం... ఈ సంవత్సరం మన మనోహర్ పేరుమీద బాగుంది కదా... వానితోని ఎడ్ల మీద ముద్రలేపిద్దాం..." అన్నాడు కొంరెల్లి...

"చదువుకుంటున్న పిల్లగాన్తోనెందుకురా కొంరెల్లి..." అన్నాడు ఓదెన్న. "వాన్తోనే చేయించుదాం..." అన్నాడు కొంరెల్లి.."స్నానం చేసినంక పోండ్రి... నీళ్ళు కాగినాయె రాజవ్వ.."

"కాగుతున్నయి... ఒత్తుల్నుంచి నీళ్ళు తోడుకొని అండ్లచన్నీళ్ళు పోయిండ్రి..." అంది రాజమ్మ.

స్నానాలు ముగించారు వాళ్ళంతా..

> **"అవుతాతా...!గా జూల పెల్లి దిక్కు కాలువలు తవ్వుతండ్రు.. ఊరిబయటికెళ్తె ఎంత మంచిగుంటది తాత... అంతా పచ్చగ... గుట్టల మీద గూడ పచ్చపచ్చగా... అంతా పచ్చదనం ఈనినట్టే... చల్లటి గాలి, మంచి నీళ్ళు... నాకు మన ఊరంటె చాలా ఇష్టం.."**

కొత్త నిక్కరువేసుకున్నాడు మనోహర్... అంతా కలిసి చకినాలు తిన్నారు.. తండ్రి, చిన్నాన్నతో కొట్టం దగ్గరికి వెళ్ళాడు... ఎడ్ల కొమ్ములకు జాజు పూసాడు మనోహర్. చేతికి జాసు పూసుకొని ఎడ్లవీపులపై చరిచాడు... మెడల్లో బంతి పూలేసారు. ఇంటికెళ్ళారు.. రెండ్రోజుల క్రితమే చకినాలు చేయడంవల్ల ఈ రోజా అవసరం లేదు.

లసుమయ్య వాకిట్లో మంచంలో కూర్చున్నాడు. అతని చుట్టూ కొడుకులు, మనుమలు, మనుమరాండ్రున్నారు... మాట్లాడుకుంటున్నారు.

"మన ఊరుకు మంచి చెరువు, కొన్ని కుంటలున్నాయి. ఒక్కసారి చెరువు నిండతె రెండు పంటలు పండుతాయి. ఇగ పోచంపాడు కాలువ నీళ్ళత్తె ఇంకా మంచిగుంటది.." అన్నాడు లసుమయ్య.

"అవుతాతా...!గా జూలపెల్లి దిక్కు కాలువలు తవ్వుతండ్రు.. ఊరిబయటికెళ్తె ఎంత మంచిగుంటది తాత... అంతా పచ్చగ... గుట్టల మీద గూడ పచ్చపచ్చగా... అంతా పచ్చదనం ఈనినట్టే... చల్లటి గాలి, మంచి నీళ్ళు... నాకు మన ఊరంటె చాలా ఇష్టం.." అన్నాడు మనోహర్.

"మనూరు చెరువు మధ్యన గుట్టలున్నయి... కడుపుల గడ్డలు లేకుంటె పాకాల చెరువుతోని పందెడుతున్నదట మన చెరువు... పొలాలు, రేగడి భూములు, దుబ్బ భూములు, గుట్టలు, చెట్లు, ఖుష్కి, మంచి పంటలు, ఊళ్ళెకు వచ్చే అర్తివాళ్ళు... ఎంత మంచిగుంటదూరు...!" అన్నాడు లసుమయ్య.

ఇంతలో 'పెద్దగొల్ల లసుమయ్య తాతా' అంటూ మందెచ్చుల వాళ్ళొచ్చారు. అందరికి శనార్తి అన్నారు. చేతిలో ఉన్న కొమ్ముతో ఊరంతా వినబడేట్టు ఊదాడు రాజమల్లు... కులాన్ని, లసుమయ్య కుటుంబాన్ని, ఊరును దీవించాడు... వాకిట్లో కూర్చున్నారు..

"ఏమిరా రాజమల్లు... సందిట్లోసడేమియా అన్నట్టు నువ్విప్పుడే వస్తివి... నీకు పండుగనాడే దొరికినాదో రావటానికి..." అన్నాడు లసుమయ్య నవ్వుతూ.

మనోహర్‌కు మందెచ్చులవాళ్ళు చెప్పే కథలు వినడం, బొమ్మలు నిలబెట్టడాన్ని చూడటం చాలా ఇష్టం. తాత వాళ్ళనలా అనడం నచ్చలేదతనికి..

"'ఏంది తాతా గిట్లంటవు...?" అన్నాడు.

"మాకు గొల్లకులంవాళ్ళే యజమానులు. మీ పండుగలే మా పండుగలు.. పండుగయినా పబ్బమయినా ఎక్కడోకాడ గడువాలె కద..."

"సరెగని ఈసారి ఎన్ని కథలు చెప్పుతారు..."

"కాటమరాజు, కలియమరాజు, మల్లన్న, గంగదేవి గిట్ల ఎన్ని కథలైనా చెప్పుతం.. మీవి మందకు రెండు ఇరువై. ఊరోల్లవి కులానికొక్కటి... ఎన్ని కథలైనా చెప్పుతం.." అన్నాడు రాజమల్లు.

"మందెచ్చులోల్లు, ఒగ్గోలు, రాజన్నలోల్లు గిట్ల ఎంతోమంది మన కులం మీద బతుకుతండ్రు..." అన్నాడు ఓదెన్న...

"ప్రతి కులానికి అర్తి వాళ్ళున్నరు..."

"గా హరిజనుల నడుక్కునే చిందు భాగోతులు మంచిగ నాటుకాలేస్తరు..."

"సాలోల్ల నడుక్కునే సాభనాసురులో...?"

"మాలోల్ల నడుక్కునె మాట్లోల్లు గూడ..."

"ముగ్గురు మరాటీల కథ జెప్పెటోల్లు కాపుల నడుక్కుంటరు..."

"కోమట్ల నడుక్కునే కన్యకాపరమేశ్వరి వాళ్ళు గూడున్నరు.. ఇంకా ఊళ్ళెకు శాందకాళ్ళు, మిత్తిరయ్యోర్లు, గుడ్డేలుగుల్లోలు, కైతుకాలోల్లు. తుపాకి రాముడు సోంటోల్లు చాలామంది వస్తరు..."

"సరెగని రాజమల్లు ఎప్పుడు మొదలువెడుతవు కథలున్న.."

"పండుగ పోయినంక మొదలు వెడుతమే లసుమన్న... అందరియి అయిపోయేవరకు రెన్నెల్లకెక్కువే ఐతది... ఈ రెన్నెల్లు మా భోజనాలు మీ ఇండ్లల్లనే గద..."

"ఇగ భోజనం తప్పుతాదిర.. కుండలగల్లది పెద్దం.. నన్ను కలిసింద్రు గద... కులపోల్లందర్ని కలిసి రాండ్రి... ఎల్లుండి అన్ని మాట్లాడుకుందాం... కులపోల్లను జమచేస్త..." అన్నాడు లసుమయ్య.

"అట్లనేనే నాయిన్న మేం పొయ్యొస్తం..."

మందెచ్చుల వాళ్ళ బృందం వెళ్ళిపోయింది..

లసుమయ్య కుటుంబమంతా కలిసి పండుగ భోజనం చేసారు... కష్టసుఖాలు మాట్లాడుకుంటూ తినడం ముగించారు. చకినాలు తిన్నారు... మధ్యాహ్నం కొంత విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రమవుతుంది. ఎడ్లకొట్టం కాడికి వెళ్ళారు... ఎడ్లను తోలుకొని ఊరిబయటకెళ్ళారు. ఎడ్లన్నీ జమయ్యాయి. మనోహర్ తండ్రి ఓదెన్న, చిన్నాన్న కొంరెల్లితో ఉన్నాడు... ఎడ్లమంద చుట్టు తిరుగుతూ ఒకరు, బోనంలోని అన్నం విసురుతూ మరొకరు పరుగెత్తారు. అన్నం విసురుతుంటే దాన్నందుకొని తింటున్నాడు ముందు పరుగెత్తేవాడు. ఆ తర్వాత ఎడ్లను పూల హారం కిందినుంచి దాటించారు. 'జాజా' అని ఎడ్లను రెచ్చగొడుతూ వాటి వెంట ఉరుకుతున్నారు. ఊరుచేరే వరకు వాటిని తరిమారు. (మిగతా 27వ పేజీలో)

(19వ పేజీ తరువాయి)

'పైలంబిడ్డా! ఎడ్లు తొక్కజిక్క' కొంరెల్లి హెచ్చరించాడు మనోహర్‌ను. అయినా ఎవరి సంబరం వారిది.. ఊరి బయట చేరిన వాళ్ళంతా ఎవరింటికి వారెళ్ళారు. కాట్లేవుల పండుగ ముగిసింది. భోగి అయిపోయింది.

తెల్లవారి సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. మనోహర్ తాతతో, చిన్నాన్నలతో, తమ్ములు, చెల్లెళ్లతో సంతోషంగా పండుగ జరుపుకున్నాడు.

'ఊరు అందరికీ తల్లిలాంటిది.. బతుకుదెరువునిచ్చేది...'' అన్నాడు లసుమయ్య. తాత మాటలు, ఉమ్మడి కుటుంబంలో జీవితం మనోహర్‌కెంతో ఆనందంగా ఉంది. ప్రతి పండుగా ఎంతో సంబరంతో జరుపుకుంటున్నారు.

మనోహర్ పెరుగుతున్నాడు. కులపోల్లందరితో చెట్ల తీర్థాలు పోవడం అతనికి చాలా ఇష్టం. అందరు కలిసి పెద్దపురపు మల్లన్న దగ్గరికెళ్ళడం మరీ ఇష్టం. మల్లన్న పట్నాలంటే ఎంతో మక్కువ. జానపద కళాకారుల కథలంటే చెవి కోసుకుంటాడు.

మనోహర్ ప్రకృతి అందాల మధ్య పెరుగుతున్నాడు. పచ్చని చెట్లమధ్య పెరుగుతున్నాడు. పంట చేల నడుమ పెరుగుతున్నాడు. మగ్గం లయబద్ధ ధ్వనులు వింటున్నాడు. కవ్వం చప్పుల్లు వింటున్నాడు. స్వర్ణకారుల సుత్తెల ధ్వని వింటూ పెరుగుతున్నాడు. ఊర్లో వరుసల పిలుపులతో పెరుగుతున్నాడు. మోట పాటలు, విసుర్రవుతు పాటలు, ఏతం పాటలు వింటూ పెరుగుతున్నాడు.

ప్రకృతిలో ప్రకృతిలా పెరుగుతున్నాడు మనోహర్. చదువుకుంటున్నాడు.

❁ ❁ ❁

నాలుగు దశాబ్దాల కాలగర్భంలో కలిసిపోయాయి. ఈ నాలుగు దశాబ్దాల కాలంలో గ్రామాల్లో చాలా మార్పులొచ్చాయి. ఊళ్ళో చదువుకున్న వాళ్ళ సంఖ్య పెరిగింది. పోచంపాడు కెనాల్ నీళ్ళు ఊరికొచ్చాయి. నగరీకరణ మోజు పెరిగింది. వలసలు పెరిగాయి. పారిశ్రామికీకరణ పెరిగింది. ఆ తర్వాత వచ్చిన మరో పెనుమార్పు ప్రపంచీకరణ... ఈ మార్పులు గ్రామాలను కుదిపేస్తాయి. అల్లకల్లోలం చేసాయి.

ఈ నలభై ఏళ్ళు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లోనే ఉన్నాడు మనోహర్. అక్కడా ఇల్లు కట్టుకున్నాడు. ఈమధ్యకాలంలో లసుమయ్య, ఓదెన్న, కొంరెల్లి, కొంరమ్మ చనిపోయారు. మనోహర్ అప్పుడప్పుడు ఊరెళ్ళి వచ్చినా అక్కడున్నది తక్కువ కాలమే... తల్లిని తన దగ్గరే ఉంచుకున్నాడు. పట్టణ జీవితంతో చాలా విసిగిపోయాడు మనోహర్.. కొద్దికాలం ఊళ్ళో ఉండి వద్దామని ఊరికొచ్చాడు. ఇప్పుడూళ్లో మనోహర్ తండ్రి తరం వాళ్ళలో మిగిలింది రాజయ్య ఒక్కడే... గత పది రోజులుగా గ్రామాల్లోని మార్పులను గమనిస్తున్నాడు మనోహర్..

''బిడ్డా..! కాపు నర్సయ్య ఆత్మహత్య చేసుకున్నాడు... వస్తవా చూసొద్దాం...'' అన్నాడు కట్టెతో కుంటుకుంటూ వచ్చిన రాజయ్య.

ఆ మాటలకు అవాక్కయ్యాడు మనోహర్...

''రైతు ఆత్మహత్య చేసుకోవడమేంటి?'' తనలో తాననుకున్నాడు. చిన్నాన్నతో కలిసి అక్కడికెళ్ళాడు.

ఏడ్పులు, పెడబొబ్బలతో అక్కడి దృశ్యం భయంకరంగా ఉంది.

''నువ్వెట్ల సచ్చిపోతివే నాయిన్నా...' బాకీలు భరించలేక సత్తివా నాయన్నా... ఎవుసాన్ని భరించలేక సత్తివా అయ్యా..! మమ్ములనెట్ల బతుకుమన్నవే అయ్యా...!

కంటికోధారగా ఏడుస్తున్నారు.

గిలగిల కొట్టుకుంటున్నారు... మొత్తుకుంటున్నారు. చేతులు భూమికి చరుస్తూ లబలబ మొత్తుకుంటున్నారు.

ఏడ్పులే ఏడ్పులు..

దుఃఖసాగరమక్కడే ఉన్నట్టుంది.

''ఏంటిది...? అన్నదాత ఆత్మహత్య చేసుకోవడమేంటి...'

తనను తానెన్నిసార్లు ప్రశ్నించుకున్నా జవాబులు దొరకడం లేదు మనోహర్‌కు..

చదువుకున్న వాళ్ళు పెరిగారు. పారిశ్రామికీకరణ పెరిగింది.. చెర్లోకి పోచంపాడు కాలువ నీళ్లు వచ్చాయి.

''అవునే చిన్నాయన్న...గా రామగుండం ఎంత పచ్చగుండేది...? అక్కడ బొగ్గుబాయిలు పడ్డంక తవ్వుకుంట పోవట్టిరి... గక్కడిప్పుడు అన్ని బొగ్గుడాల బొగదలే... మట్టికుప్పలే.. పచ్చటి భూమిప్పుడు పనికి రాకుంటయింది... అక్కడ జీలుగులు, జిల్లేళ్ళు మొలుస్తున్నయట...''

అయినా ఇదేంటి? ఏటితోపాటు దుఃఖం పెరిగిందా...?

తననుతానే ప్రశ్నించుకున్నాడు..

రాజయ్యతో కలిసి ఇంటికెళ్ళాడు మనోహర్.

''ఏందే చిన్నాయన్న...? ఇదంతేంది..?'' అడిగాడు.

''ఏందో బిడ్డ... నాకుగూడ అర్థమయితలేదు... సుఖం పెరిగిందంటరు... కాని నాకయితె దుఃఖం పెరిగినట్టనిపిస్తుంది. అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు... చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు... ఏమవుతుందో తెలుస్తలేదు...'' అన్నాడు రాజయ్య.

''కాదే చిన్నాయన్న... సృష్టికర్తలే చనిపోతెట్ల...?''

''ఫ్యాక్టరీలు వచ్చినయి... కాని కాలుష్యం పెరిగింది...గా రామగుండం మనకు దగ్గరున్నది గద... గక్కడ పరిశ్రమలు బోగద గాన్నుంచి విషవాయువులచ్చి ఆమ్లవర్షం కురిసిందిక్కడ...''

''అవునే చిన్నాయన్న...గా రామగుండం ఎంత పచ్చగుండేది...? అక్కడ బొగ్గుబాయిలు పడ్డంక తవ్వుకుంట పోవట్టిరి... గక్కడిప్పుడు అన్ని బొగ్గుడాల బొగదలే... మట్టికుప్పలే.. పచ్చటి భూమిప్పుడు పనికి రాకుంటయింది... అక్కడ జీలుగులు, జిల్లేళ్ళు మొలుస్తున్నయట...''

''నీకు తెలువందేముంది బిడ్డ... మునుపటి తీరుగ కుండపోత వర్షాలు లేవు. తుఫానో, వాయుగుండమో వస్తేనే వానలు పడుతున్నాయి గాని మామూలుగ పడుతలేవు...''

''వ్యవసాయాలు ఎట్లున్నయే చిన్నాన్న...?''

''చాలా ఎవుసాన్ని మూలకుపడ్డాయి. మునుపటి తీరుగ ఎడ్ల మందలు లెవ్వు... గొర్లమందలు సగమైనయి... భూములను ఎరువులు తింటున్నయి... పనికి రాకుంటయితున్నయి...'' అన్నాడు రాజయ్య... గోరేటి వెంకటన్న పాటలోని దృశ్యాలు జ్ఞాపకాలు వచ్చాయి మనోహర్‌కు..

మరో పది రోజులు ఊళ్ళోనే ఉన్నాడు మనోహర్.. ఊరంతా చాలాసార్లు తిరిగి చూసాడు. పొలాలు, చేలల్లోకి వెళ్ళాడు. అనేక విషయాలు గమనించాడు.

బాడిస పాడయింది... మగ్గం మూలకు పడ్డది.. 'షరి' గుంజలు తుప్పుపట్టాయి.. నాగలి పాలె విరిగింది.. కుమ్మరి చక్రం తిరగడం లేదు. కమ్మరి కొలిమి మండడం లేదు. పాల కవ్వాల అటుకెక్కాయి.. పల్లకి తుప్పు పట్టింది.. కంసాలి సుత్తె మోగడం లేదు. తూటు కొమ్ముల ధ్వని అసలే లేదు. జానపద బిడ్డగాళ్ళు రావడం అరుదయింది. పండుగల్లో వెలుగులేదు. జానపద కోకిల భూమక్క గొంతు మూగబోయింది. ఊళ్ళోకి రెండు ట్రాక్టర్లొచ్చాయి. పక్క ఊళ్ళోనే సినిమా టాకీసయింది. జంబి దగ్గర కొట్లాటలవుతున్నాయి.. తండ్రి, తాతల కళలు, మంచితనం పిల్లలకబ్బలేదు. ఊళ్ళో పైసలివ్వడానికెవరూ ముందుకు రావడం లేదు. ఇదువరకున్న మనిషిపై నమ్మకం పోయింది. బావుల్లో నీళ్ళు పాతాళ లోకంలోకి వెళ్ళాయి. చెలిమలు ఎండిపోయాయి. కూలీలకు చేతుల్నిండా పనుల్లేవు.

మనుషులు రాజకీయులుగా విడిపోయారు. బస్టాండు దగ్గర అన్ని పార్టీల జెండాలున్నాయి. మనసులు దూరమయ్యాయి. మనోహర్‌కు మనుషుల మధ్య దూరం పెరిగినట్టనిపిస్తుంది. మనిషి జాడే కనబడటంలేదు.

ఇక భరించలేకపోతున్నాడు మనోహర్.

బస్టాండు 'దగ్గరున్న హోటల్లో కూర్చున్నాడు..

బస్సు వచ్చాగింది... బస్సు చుట్టు తిరుగుతున్నారు ఇద్దరు. పిల్లలు... ''నీళ్ళు... నీళ్ళు... వాటర్... వాటర్'' అని అరుస్తున్నారు.

''వాళ్ళేం చేస్తున్నారు రాఘవరెడ్డీ...''

తన పక్కనున్న వ్యక్తినడిగాడు మనోహర్.

''నీళ్ళమ్ముతున్నారు... నీళ్ళు...పాకెట్లో ఉన్న బుక్కెడు నీళ్ళకు రెండు రూపాయలు...'' అన్నాడు రాఘవరెడ్డి.

ఇంకా విధ్వంస దృశ్యాలను చూడటం ఇష్టంలేదు మనోహర్‌కు. 'ఒకప్పుడు ప్రకృతి అందాలతో అలరారే తన ఊరు... ఇప్పుడిలా...??'

రెండురోజుల తర్వాత భారమైన హృదయంతో హైదరాబాద్ బస్సెక్కాడు మనోహర్.

★

**రచయిత చిరునామా:**

**డా. కాలువ మల్లయ్య,**

44/214, హుడా కాంప్లెక్స్

క్రాంతి హారిక అపార్ట్‌మెంట్స్,

కొత్తపేట- సరూర్‌నగర్,

హైదరాబాద్- 500 035.